నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: వర్షాకాలంలో విద్యుత్ లైన్ల మరమ్మ తుల కారణంగా ఘట్‌కేసర్ సబ్‌స్టేషన్ 11కేవీ డైయానో ఫీడర్ పరిధిలోని యాంనంపేట్ పారిశ్రామికవాడ, ఘనాపూర్ పారిశ్రామిక వాడ, పకీర్‌టెక్యాతండా, లింగాపూర్ తండాలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫ రాకు అంతరాయం ఉంటుందని, ఘట్‌కేసర్ ఏఈ యశ్వంతకుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

దేశంలోనే గర్వపడే వ్యవస్థగా 'పీటీఓ'

మేడ్చల్ పోలీస్ శిక్షణా కళాశాలలో పాసింగ్ ఔట్ పెరేడ్



మేడ్చల్‌రూరల్: దేశంలోనే గర్వపడేలా పీటీఓ వ్యవస్థ ఆవిర్భవించిందని, ఐపీఎస్ యం. రమేష్ అన్నారు. మేడ్చల్‌లోని పోలీస్ అకాడమీలో పీటీఓ (పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్) శిక్షణ పూర్తిచేసుకొని పాసింగ్ ఔట్ పరేడ్ శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన శిక్షణ పొందిన పోలీసులకు పలు సలహాలు, సూచనలు చేశారు. పీటీసీ ప్రిన్సిపాల్ మధుకర్‌స్వామి, పీటీఓ రాజేష్, పలువురు ఏసీపీలు పాల్గొన్నారు.

బొలేరో వాహనం దగ్ధం



మంటల్లో కాలిపోతున్న వాహనం

మేడ్చల్‌రూరల్ : నడిరోడ్డుపై ఓ బొలేరో వాహనం దగ్ధమైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గిర్మాపూర్ శివారు రాయిలాపూర్–గౌడవెల్లిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నూతన్‌కల్ నుంచి దేవరయాంజాల్‌కు బొలెరో వాహనంలో శీతల గిడ్డంగి ఉంచి వాహన యాజమాని విత్తనాలను సరఫరా చేస్తున్నాడు. కాగా శుక్రవారం సాయంత్రం నుంచి నిరంతరాయంగా వాహనాన్ని నడపడంతో వాహన ఇంజిన్‌అధిక వేడికిలోనై షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. కొద్దిసేపట్లో మంటలు వ్యాపించి వాహనం మొత్తం దగ్ధమైంది. అప్రమత్తమైన డ్రైవర్ వాహనం పూర్తిగా దగ్ధం కాకముందే పక్కకు తప్పుకున్నాడు. దీంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

జడ్జి శ్రీదేవిని కలిసిన కలెక్టర్ మనుచౌదరి



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కోర్టు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్ జడ్జి శ్రీదేవిని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ జడ్జి తిరుపతి, 3వ అడిషనల్ డిస్ట్రిక్ జడ్జి వెంకటేశ్వరరావులను కూడా ఆయన కలిసి వారికి పుష్పగుచ్ఛం అందజేశారు.

'మహనీయులను అగౌరవపరిస్తే సహించం'

మల్కాజిగిరి: మహనీయులను అగౌరపరిస్తే ఊరుకోమని రాష్ట్ర బీసీ అభివృద్ధి సంఘం ప్రచార కార్యదర్శి తుపాకుల జనార్దన్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల మల్కాజిగిరి ఎమ్మెల్యే సఫిల్‌గూడ మినీట్యాంక్ బండ్‌పై బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రముఖుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కోరడం హర్షనీయమన్నారు. స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ విగ్రహాల ఏర్పాటు వద్దని చెప్పడం మహనీయులను అవమానపరిచినట్లేనన్నారు. తన డివిజన్‌లో ఉన్న సఫిల్‌గూడ లేక్‌ను ఐదేళ్ల నుంచి పదవిలో ఉన్నా.. అభివృద్ధి చేయలేకపోయారన్నారు. బడుగు బలహీన వర్గాల ఓట్లతో గెలిచిన కార్పొరేటర్ వారి విగ్రహాల ఏర్పాటుకు అడ్డు చెబితే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

ఉప్పల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల బదిలీ

ఉప్పల్: ఉప్పల్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో అధికారులను గ్రేటర్ కమిషనర్ బదిలీ చేశారు. ఇక్కడ ఇన్‌చార్జ్ ఏసీపీగా పనిచేసిన ముంతాజ్ స్థానంలో మెహిదీపట్నంలో ఏసీపీగా పనిచేసిన కృష్ణమూర్తి ఉప్పల్ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్‌గా, ఇక్కడి సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేసిన సురేష్‌కుమార్‌ను జూబ్లీహిల్స్‌కు, గాజులరామారంలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేసిన తుల్జాసింగ్ ఉప్పల్ సర్కిల్‌కు బదిలీ చేశారు. సోమవారం వీరు విధుల్లోకి వచ్చే అవకాశం ఉంది.

కాలం చెల్లిన బస్సులే అధికం !

- జిల్లాలో విద్యా సంస్థలకు 6,002 బస్సులు
- 3,200 వాటికే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు
- బస్సు సామర్థ్యంపై అనుమానాలెన్నో..
- దృష్టి సారించాలంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు



సాక్షి,సిటీబ్యూరో: విద్యాసంస్థల పునః ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా విద్యార్థుల రవాణాకు ఉపయోగించే వాహనాలకు సామర్థ్య పరీక్షలు నిర్వహించటంలో కొన్ని విద్యా సంస్థలు నిర్లక్ష్యాన్ని ప్రదర్శించటపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బడి బస్సుల విషయంలో కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు నిర్లక్ష్యపు వైఖరి వీడటం లేదు. పాఠశాలలు ప్రారంభానికి ముందే సామర్థ్య పరీక్షలు పూర్తి చేసుకోవాలని రవాణా శాఖ అధికారులు హెచ్చరించినా బేఖాతరు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలు, పర్మిట్లు, పన్నులు కట్టని విద్యాసంస్థలకు సంబంధించిన పలు బస్సులను రవాణా శాఖ సీజ్ చేస్తోంది. పాఠశాలల్లో చేర్పించే ముందు తల్లిదండ్రులు కూడా ఆయా విద్యాసంస్థల బస్సులకు సామర్థ్య పరీక్ష పూర్తైందా?, నిబంధనల ప్రకారమే నడుపుతున్నారా? లేదానన్న విషయంపై ఆరా తీయాల్సినా అవసరం ఉంది.

కఠినంగా వ్యవహరిస్తేనే..

విద్యా సంస్థల బస్సుల ఫిట్‌నెస్ విషయంలో కొందరు అధికారులు ఉదాసీనంగా, ఏజెంట్లు చెప్పినట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సామర్థ్య పరీక్షలు చేయించని బస్సుల విషయంలో విద్యా సంస్థల యాజమాన్యాలకు నోటీసులు ఇవ్వడంతో పాటు వాటి వివరాలను తెలుసుకోవాల్సి ఉంటోంది. ఈ విషయంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తే విద్యార్థులను ప్రమాదంలోకి నెట్టినట్టేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో విద్యాసంస్థలకు సంబంధించిన బస్సులు, వాహనాలు మొత్తంగా 6,002 ఉండగా, ఇందులో ఇప్పటి వరకు 3,200 వాహనాలు రవాణా శాఖ నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. రవాణా శాఖ అధికారులు దాడులు నిర్వహిస్తున్నప్పటికీ ప్రైవేట్ విద్యాసంస్థలు తమ వాహనాలకు ఫిట్ నెస్ పొందటానికి చూపుతున్న అలసత్వంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. విద్యార్థులకు జరగరాని ప్రమాదం ఏమైనా జరిగితే బాధ్యత ఎవ్వరు వహిస్తారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఫిట్‌నెస్‌కు ఇవి తప్పనిసరి

15 ఏళ్లు నిండిన వాహనాలను విద్యార్థుల రవాణాకు ఉపయోగించడానికి వీలులేదు. వాహనం పూర్తి కండిషన్లో ఉండాల్సి ఉంటోంది. విద్యా సంస్థ పేరు, ఫోన్ నంబర్, పూర్తి అడ్రస్ బస్సు ఎడమవైపు, ముందు భాగంలో స్పష్టంగా కనిపించేలా రాయించాలి. ప్రతి విద్యాసంస్థ యాజమాన్యం డ్రైవర్ ఆరోగ్య పట్టిక నిర్వహించాలి. డ్రైవర్‌కు బీపీ, షుగర్, కంటి చూపు వంటి ప్రాథమిక పరీక్షలను ప్రతి మూడు నెలలకోసారి చేయించాల్సి ఉంటోంది. డ్రైవర్‌కు 5 సంవత్సరాల అనుభవం తప్పనిసరిగా ఉండాలి. బస్సుకు అత్యవసర ద్వారం ఉండాలి. బస్సుకు సంబంధించిన విండ్ స్క్రీన్, వైపర్స్, లైటింగ్స్, పార్కింగ్ లైట్స్ ఉండాలి. టైర్లు కూడా కండిషన్‌గా ఉండాలి. ప్రతి వాహనంలో మంటలు ఆర్పే పరికరాలు తప్పనిసరిగా ఉండాలి. డ్రైవర్‌కు విద్యార్థులు బస్సు ఎక్కడం, దిగడం స్పష్టంగా కన్పించే విధంగా అద్దాలు అమర్చాలి. ప్రథమ చికిత్స పెట్టె, అటెండర్ ఉండాలి. ఫుట్ బోర్డుపై మొదటి మెట్టు భూమికి 325 మిల్లీ మీటర్ల ఎత్తును మించకుండా చూడాల్సి ఉంటోందని రవాణా శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

స్వయం ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న వజ్రేష్‌యాదవ్, స్థానిక నాయకులు

కీసర: రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఇందిరమ్మ మహిళ పథకం కింద మైనార్టీ వర్గాల మహిళలకు కుట్టుమిషన్లు మంజూరైన సందర్భంగా శనివారం నాగారం ప్రభుత్వ మైనార్టీ బాలికల పాఠశాలలో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు మహ్మద్ ముజీబుద్దీన్ చేతులమీదుగా లబ్ధిదారులకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ.. మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్, జిల్లా రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆథారిటీ మెంబర్ జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ..

జవహర్‌నగర్: వజ్రేష్‌యాదవ్ ఆధ్వర్యంలో హజ్ కమిటీ మెంబర్ ముజుబుద్దీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. మహిళలు స్వయం ఉపాధితో రాణించి కుటుంబాలకు ఆసరాగా నిలవాలని ఆకాంక్షించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, నాయకులు భాస్కర్, సతీష్‌గౌడ్, వినయ్‌కుమార్, రాజుయాదవ్, సాయికృష్ణ, అరుణ, భాను పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి



మేడ్చల్ జయశంకర్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న నేతలు

మేడ్చల్: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని మేడ్చల్‌లో తెలంగాణ ఉద్యమకారులు, వివిధ పార్టీల నాయకులు నిర్వహించారు. మేడ్చల్‌లోని జయశంకర్ చౌరస్తా వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిషత్, గౌడవెళ్ళి తదితర ప్రాంతాల్లో ఉన్న జయశంకర్ విగ్రహలకు నేతలు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. వివిధ పార్టీల నాయకులు మల్లేష్‌గౌడ్, కొండల్‌రెడ్డి, ప్రవీణ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

భారత యువతకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్



స్నాతకోత్సవంలో విద్యార్థులకు పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: భారతీయ యువతకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉందని, మాజీ మంత్రి ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో 14వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. 145 కోట్ల జనాభా ఉన్న మన దేశంలో అత్యధిక యువత ఉన్నారని, ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ భారత దేశానిదని వివరించారు. ప్రపంచ స్థాయి సంస్థల్లో భారతీయులు కీలక స్థానాల్లో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని, అంకితభావం, పట్టుదల, విలువైన నైపుణ్యాలు కలిగి ఉండటం వల్లే సాధ్యమైందని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకెళ్తున్న తరుణంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. మల్లారెడ్డి విద్యాసంస్థల డైరెక్టర్ ఎండీ మహేందర్‌రెడ్డి, డైరెక్టర్ శాలినీ, ప్రిన్సిపాల్ మాధవీలత, ప్లేస్‌మెంట్ అధికారి బీవీఎస్పీ పవన్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

సాక్షి,సిటీబ్యూరో: రైతు భరోసా పథకంతో అన్నదాతకు ప్రభుత్వం అండగా ప్రభుత్వం నిలుస్తోందని, మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. రైతు భరోసా పథకం ద్వారా శనివారం వరకు మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలోని 5,015 మంది రైతుల ఖాతాల్లో రూ. 4.23 కోట్లు జమ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. విడతల వారీగా రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులు పడతాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. వ్యవసాయానికి పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయ రంగం అభివృద్ధికి రైతు భరోసా ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. వర్షాకాలం సాగు ప్రారంభానికి ముందే ప్రభుత్వం రైతు భరోసా నిధులు అందించడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

చైన్ స్నాచింగ్..

మహిళ మెడలోని తాళి లాక్కెళ్లిన దుండగుడు

మేడ్చల్‌రూరల్: మహిళ మెడలోనుంచి పుస్తెల తాడు లాక్కెళ్లిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని గిర్మాపూర్‌కు చెందిన చాకలి సుశీల కండ్లకోయ సమీపంలో రింగురోడ్డు సర్వీసు రోడ్డు పక్కన ఉన్న కళాశాలలో పనిచేస్తోంది. కాగా రోజూ మాదిరిగానే శనివారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో రింగురోడ్డు సర్వీస్ రోడ్డు మీదుగా నడుచుకుంటూ కళాశాల వైపు వెళ్తుండగా.. వెనక నుంచి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోని పుస్తెలతాడును లాక్కెళ్లాడు. ద్విచక్ర వాహనంపై వేచి ఉన్న మరో ఇద్దరితో కలిసి పారిపోయాడు. కాసేపటికి తేరుకున్న బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీతారాముల ఆలయ బ్రహ్మోత్సవాలు

బోడుప్పల్: 7వ డివిజన్ పరిధిలోని సాయిమారుతీనగర్ కాలనీలోని సీతారాముల దేవాలయం బ్రహ్మోత్సవాలను నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు హరినాథ్‌రెడ్డి, దేవాలయ అధ్యక్షుడు శశికిరణ్, వెంకట్‌రాజు, చంద్రమౌళి, ఆంజనేయులు, మల్లేష్, నర్సిరెడ్డి, మహేందర్, మధురబాబు పాల్గొన్నారు.

ప్రారంభమైన 'ఎంపీఎల్- 5' క్రికెట్ టోర్నీ



టోర్నీని ప్రారంభిస్తున్న మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: మర్పల్లిగూడ గ్రామంలో మర్పల్లిగూడ ప్రీమియం లీగ్ సీజన్–5 (ఎంపీఎల్–5) క్రికెట్ టోర్నీ ఘనంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథులుగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి హాజరై టోర్నీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి వైఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. జంగయ్య యాదవ్, మల్లేష్, సాయిలు, నరేష్, సంజీవరెడ్డి, సత్తిరెడ్డి, ఆంజనేయులుయాదవ్, నాగరాజ్‌ముదిరాజ్, వెంకటరమణ, లక్ష్మయ్య, సాయికుమార్, రవిగౌడ్, అశోక్, క్రీడాకారులు, స్థానికులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో యోగా దినోత్సవం



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అవరణలో అధికారులు, ఉద్యోగులు యోగా దినోత్సవం సందర్భంగా ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉమాగౌరీ మాట్లాడుతూ.. ఆరోగ్యం శ్రేయస్సు కోసం యోగా అభ్యాసాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శారీరక, మానసిక శ్రేయస్సుకు యోగా ఒక మార్గమని, ఆరోగ్యకరమైన జీవితం కోసం జీవనశైలి మార్పు కోసం రోజువారీ జీవితంలో యోగాను అంతర్భాగంగా స్వీకరించాలని ఉద్యోగులకు ఆమె సూచించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు డాక్టర్ శోభ, డాక్టర్ సత్యవతి, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్లు శ్రీదేవి, మల్లేశ్వరి, గీతాప్రసాద్, చంద్రకళ, వినోద్, మంజులరాజేశ్వర్‌రెడ్డి, జిల్లా ఆయుష్ కార్యక్రమ పర్యవేక్షులు డాక్టర్లు శ్రీవల్లి, జంగయ్య , శ్రీదేవి, జ్యోత్స్న, సంతోష్, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.4 కోట్లతో అభివృద్ధి పనులు



ఉప్పల్: రూ. 1.4 కోట్లతో చిలుకానగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. డివిజన్ పరిధిలోని న్యూరామ్‌నగర్, బీరప్పగడ్డ, ప్రశాంత్‌నగర్ కాలనీల్లో రూ. 80 లక్షలతో మురుగునీటి కాల్వల పైపులైన్, సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వీటితో పాటు కావేరినగర్ కల్వర్టు వద్ద రూ.16.5 లక్షలతో బాక్స్‌డ్రైన్ పనులు, రూ.7 లక్షలతో చైన్‌లింక్ ఫెన్సింగ్ తదితర పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, నియోజకవర్గానికి ఎక్కడా లేని విధంగా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. ఎలాంటి సమస్యలైన తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, బన్నాల ప్రవీణ్, ఈఈ హరిలాల్, డీఈ వినీల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: రైతు భరోసా నిధుల పంపిణీలో ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని బీజేపీ మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా బీజేపీ అర్బన్ అధ్యక్షుడు మల్లారెడ్డి ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతు భరోసా నిధులను విడుదల చేసిన ప్రభుత్వం జిల్లాలోని మేడ్చల్, దుండిగల్, శామీర్‌పేట, ఘట్‌కేసర్, మేడిపల్లి మండలాల్లోని రైతులకు ఎందుకు విడుదల చేయలేదో వివరించాలని డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని జిల్లా ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని గ్రామాలను సమీపంలోని మున్సిపాలిటీల్లో విలీనం చేసినప్పటికీ.. ఇవన్నీ గ్రామీణ ప్రాంతంగానే ఉన్నాయన్నారు. ఇక్కడి రైతులే కూరగాయలు, ధాన్యం, పప్పులు, ఇతర వాణిజ్య పంటలు పండిస్తూ.. నగరానికే అన్నం పెడుతున్నారన్నారు.

నేడు సంకల్ప సభ

మల్కాజిగిరి ఎంపీగా ఈటల రాజేందర్ పదవీ కాలానికి ఏడాది పూర్తైన సందర్భంగా ఆదివారం ఉదయం 11 గంటలకు సికింద్రాబాద్ ఇంపీరియల్ గార్డెన్స్‌లో వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహించనున్నట్లు మల్లారెడ్డి తెలిపారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్ప సభ కరపత్రాన్ని విడుదల చేశారు.

ఉచిత వైద్య శిబిరం



కీసర: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ వింగ్స్ ఆధ్వర్యంలో శ్రీకర ఆసుపత్రి సహకారంతో శనివారం కరీంగూడలో విద్యార్థులు, గ్రామస్తులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు అందజేశారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ అబాన్, కార్యదర్శి వీణవిశ్వనాథ్, సభ్యులు దాసరి కృష్ణారెడ్డి, బలదేవ్‌సింగ్, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, వెంకటేష్‌గౌడ్, హరిప్రసాద్‌రెడ్డి, రాజుగౌడ్, సుధాకర్, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏకశిలానగర్ వివాదంపై హైడ్రా సమీక్ష

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ఏకశిలానగర్ 'వెంచర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్' ప్రతినిధులు, హర్ష కన్‌స్ట్రక్షన్స్ అధినేత వెంకటేష్, మరో ఏడెకరాల భూయజమానులతో శనివారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. హర్ష కన్‌స్ట్రక్షన్స్ బిల్డర్లు తమ ప్లాట్లలో ఇళ్లు కట్టుకోనివ్వడం లేదని, ఉన్న వాటిని కూల్చివేస్తున్నారని ఏకశిలానగర్ వెంచర్ డాక్యుమెంట్ హోల్డర్లు హైడ్రా ఆఫీస్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో సమస్యను పరిష్కరించేందుకు ఏకశిలానగర్ వెంచర్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఇరు వర్గాల వాదనలు వినేందుకు హైడ్రా ఆఫీస్‌లో సమావేశమయ్యారు. ఏకశిలానగర్ వెంచర్ వాసుల ప్రాపర్టీతో తన ప్రాపర్టీకి ఎలాంటి సంబంధం లేదని వెంకటేష్ స్పష్టం చేశారు.

- కొర్రెముల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 739–742లో తన ప్రాపర్టీ ఉందని, ఏకశిలానగర్ వెంచర్‌ను సర్వే నెంబర్లు 743–747లోని 64 ఎకరాల 36 గుంటల్లో ఏర్పాటు చేశారని చెప్పారు. తన ప్రాపర్టీకి ఉన్న పర్మనెంట్ ఇంజెక్షన్ ఆర్డర్‌ని పరిశీలించమని కోరారు. అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. తమ ప్లాట్ల హద్దురాళ్లు, ప్రహరీలు, రేకుల రూములను వెంకటేష్ తొలగిస్తున్నారని చెప్పారు. అందుకు కమిషనర్ స్పందిస్తూ.. సివిల్ కోర్టు నుంచి ఆదేశాలు తీసుకుని, స్థానిక సంస్థల ద్వారా అనుమతులు తీసుకున్నాకే నిర్మాణాలు చేపట్టాలని, అప్పుడే మీకు హైడ్రా అండగా.. నిలుస్తుందని డాక్యుమెంట్ హోల్డర్లకు చెప్పారు. కోర్టు నుంచి ఎవరికి అనుకూలంగా ఆదేశాలు వస్తే వారికే భద్రత లభిస్తుందని స్పష్టం చేశారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

మేడ్చల్‌రూరల్: గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు వ్యక్తులను ఎస్వోటీ పోలీసులు శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మునీరాబాద్ గ్రామ శివాజీ విగ్రహం వద్ద ఐదుగురు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో ఎస్వోటీ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఒడిశా, బీహార్‌కు చెందిన ఐదుగురి వద్ద 2.5కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని మేడ్చల్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రాంపల్లి జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో..



చౌదరిగూడ నల్ల నర్సింహారెడ్డి కళాశాలలో..

యోగా సాధనతోనే మానసిక ప్రశాంతత

ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవ వేడుకలు

మేడ్చల్ జోన్ పరిధిలో ప్రపంచ యోగా దినోత్సవం ఘనంగా జరిగింది. శనివారం పలువురు మాట్లాడుతూ.. యోగ సాధనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని వివరించారు. యోగాను ప్రతిరోజూ మన జీవితంలో భాగంగా చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారవుతామన్నారు.

– మేడ్చల్ జోన్ బృందం





అవుషాపూర్‌లో ధ్యానం చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



అత్వెల్లి ప్రభుత్వ పాఠశాలలో..



సాయిగీత ఆశ్రమంలో..